

Author of Highest Number of Novels In Telugu

## సూర్యదేవర రామ్ మోహన రావు




# ముగ్ధ

# ముగ్ధ

సూర్యదేవర రామ్‌మోహనరావు

మధుప్రియ పబ్లికేషన్స్

# ముగ్ధ

జీవితం కొందరికి విశాలమైన ఆకాశం. మరికొందరికి ఉరకల, పరుగుల, విలాసమైన సముద్రం. జీవితం కొందరికి లేత బుగ్గమీద కన్నీటి చుక్క. మరికొందరికి పున్నమి వెలుగుల్లో పూలమొక్క. జీవితం కొందరికి కనబడని కంటి కాటుక. మరికొందరికి సప్తస్వరాల్ని కాళ్ళకు కట్టుకున్న బంగారు పట్టీల సంజె వెలుగు.

పురుషుడికైనా, స్త్రీకయినా బతుకు నిండుసున్నా దగ్గరే ప్రారంభమవుతుంది. బాల్యం, అస్పష్టపు జ్ఞాపకాలు, పెరుగుదల, మరచిపోలేని వాతావరణం, యౌవనం, కలలు, ఆశలు, ఆకాంక్షలు, జడివానలా ముంచెత్తి, ఉక్కిరి బిక్కిరి చేసే ప్రేమ, పెళ్ళి, ఉద్యోగం, వ్యాపారం, ఒక అధ్యాయమైతే, పెళ్ళయిన తర్వాత మరో అధ్యాయం ప్రారంభమవుతుంది... వ్యామోహం, పిల్లలు, అస్పష్టపు దారిని సరైన దారిగా మార్చుకోడానికి చేసే విశ్వ ప్రయత్నం... ఆ ప్రయత్నంలో సఫలాలు, విఫలాలు, భోగాలు, త్యాగాలు, యోగాలు, చివరికి రోగాలు, మనిషిని చివరి వరకూ అంటి పెట్టుకునే వుంటాయి. ఎన్నెన్నో మలుపులు, ఎన్నెన్నో మజిలీలు, ఎన్నెన్నో మెరుపులు, ఎన్నెన్నో మసకలు.

క్షణక్షణం ఉద్వేగం...

క్షణక్షణం ఉల్లాసం...

క్షణక్షణం ఉత్సాహం...

క్షణక్షణం ఉచ్ఛ్వాసం....

ఈ నాలుగు దారంట్ల ఊపిరి బిగబట్టుకుని నడిచే మనిషి చివరి కేంద్రం మళ్ళీ బిందువే. నిండుసున్నా దగ్గర ప్రారంభమయ్యే జీవితం ఫలించినదనడానికి సంకేతం 'ఒకటే'. సార్థకత, సఫలత, ఆశ, దీక్ష కలగలసి ఒకటై ఆ సున్నాకు ముందు చేరాయా? వెనక చేరాయా?

ఈ ప్రశ్నకు జవాబు లేదు. ఇదొక అనంతం. ఆ అనంతంలో ఒక చివరే ముగ్ధ.

* * * * *

ఆ అమ్మాయి ఆనందంతో గుప్పెడు ముద్దుల్ని గాల్లోకి విసిరింది. అవి అలా అలా అలల్లా ప్రేమకు పవిత్ర చిహ్నమైన ఆగ్రాలోని తాజ్‌మహల్ పాలరాతి గోడలకు రాసుకుని, హైదరాబాద్‌లోని ప్రణయదేవత భాగమతి మనోస్మృతి చార్మినార్ బురుజుల్ని తాకి, రాజమండ్రి గోదావరి తేటనీటి తెరచాపమీద ప్రయాణించి, కర్నూలు కొండారెడ్డి బురుజును లతలా అల్లుకుని కదిలి, పుల్లంపేట గులాబీ పరిమళాల్లో మునిగి, శ్రీకాళహస్తి స్వర్ణముఖిలో తేలి, కార్వేటినగరం కోటగోడలమీద వాలి, శ్రీకృష్ణ దేవ'రాయల చెరువు' గట్టుమీద సేదతీరి, తిరుపతి కొండల మాటున దాగిన అపురూప శిలాతోరణాన్ని మెత్తగా స్పృశించి, చంద్రగిరి కోట ప్రాంగణంలో వున్న కొలను పాయల్లోంచి బయటికొచ్చి అక్కడేవున్న రక్తపలాశ పుష్పాల్లా మారిపోయి, అంతలోనే ఎండిన పువ్వుల్లా జలజలా కిందకు రాలిపోయాయి.

ఆ అమ్మాయి పేరు ముగ్ధ.

ముగ్ధ నల్లగా వుంటుంది. ఐనా ముగ్ధ బావుంటుంది. బాపుబొమ్మలా, వయ్యారంగా, నండూరి ఎంకిలా బాగుంటుంది. సన్నగా, పొడవుగా వుంటుంది. ఆ అమ్మాయి అంతంత కళ్ళల్లోంచి ఆనందం, ఆశలు కలగలిసి తొంగి చూస్తున్నాయి. పొడవాటి వత్తయిన తెలుగు జడ ఆ అమ్మాయి సొత్తు. ఆ అమ్మాయి నవ్వుకూడా చాలా అందంగా వుంటుంది. నిరాశతో చచ్చిపోవడానికి వెళుతున్నవాడు, ఆ అమ్మాయి నవ్వుని చూస్తే తిరిగొచ్చేసి, చక్కగా ఓ అమ్మాయిని ప్రేమించి, మరీ పెళ్ళి చేసుకుంటాడు.

"ఎంత బావుందో చంద్రగిరి కోట" విప్పారిన కళ్ళతో ఇటుక రంగులో కనిపిస్తున్న ఆనాటి చంద్రగిరి కోటను ఆశ్చర్యంతో చూస్తూ అంది ముగ్ధ.

ముగ్ధతోపాటు అక్కడ మరికొంతమంది అమ్మాయిలు, అబ్బాయిలున్నారు. వాళ్ళందరూ తిరుపతి వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం స్టూడెంట్స్. అందరూ పోస్టు గ్రాడ్యుయేషన్ ఆఖరు పరీక్ష రాసి, ఆనందంగా విడిపోయే ముందు, స్వంత ఊళ్ళకు వెళ్ళిపోయే ముందు చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి కోటను చూడ్డానికి వచ్చారు.

"పుట్టపర్తి దేవాలయంలా వుందికదూ కోట" మెట్లెక్కుతూ అంది సురభి.

"తల్లీ! ఇక్కడకూడా నీ దేవాలయాల గోలేనా. నువ్వు పూర్వజన్మలో భక్త వీరాబాయివో, సతీసక్కుబాయివో అయ్యుంటావు" జోకేసింది అలక.

"పోనీ దానికి దైవభక్తయినా వుంది. నీకదీ లేదుగదే! ఎప్పుడూ అబ్బాయిల గోలేకదా, నీకు హీమాన్ కనబడగానే హైపిచ్‌లో వుంటావ్ గదా" ఓరకంట అలకవేపు చూస్తూ అంది నీలిమ.

"కుర్రాళ్ళను తక్కువగా చూడకోయ్! 'కుర్రాళ్ళోయ్ కుర్రాళ్ళు' బాలచందర్ సిన్మాలో పాట వినలేదా? ఎప్పుడూ సీతారామ కళ్యాణం, లవకుశ, పాదుకా పట్టాభిషేకం సిన్మాలు రెండేసిసార్లు చూసే నీకేం తెలుస్తుందిలే కుర్రాళ్ళ గురించి. కుర్రాళ్ళంటే వరల్డ్‌లో ఫ్యాషన్స్, కుర్రాళ్ళంటే వరల్డులో సెన్సేషన్. అవసరమైతే వాళ్ళు నిప్పుకణికలు. కుర్రాళ్ళ శక్తి నీకేం తెలుసు" అలక ఉక్రోషంగా అంది.

"వాళ్ళు ఫైర్‌బ్రిగేడ్సని నాకూ తెలుసుగానీ నేను మాట్లాడింది నీ గురించి మహాతల్లీ" నీలిమ జవాబిచ్చింది.

"ముందు నీ గురించి ఆలోచించుకో, తర్వాత దాని గురించి. ఏం అబ్బాయిల్ని చూస్తే తప్పా? ప్రేమిస్తే తప్పా?" కోపమొచ్చింది అలకకు.

"ప్రేమించు తల్లీ! ప్రేమించు! ప్రతి అడ్డమైనవాణ్నీ ప్రేమించు, నేనేం కాదన్నానా? అడ్డొస్తానా? ఫ్రెండ్‌వని చెప్తున్నాను. సుఖాలకోసం, ఆలోచన లేకుండా పరుగెత్తే ప్రతి ఆడపిల్లా ఎలా ఔతుందో మన కళ్ళెదురుగా ఎన్నో ఉదంతాలున్నాయి. హిందీ నటి రేఖ, మార్లిన్ మన్రో, పామెల్లా బోర్డస్, పర్వీన్‌బాబీ, ఎంతోమంది... ఎంతో మంది. వాళ్ళ జీవితాల్ని చూడు. పండులా ఆకర్షణీయంగా కనిపించినా, ఆ జీవితాలకు రెండోపక్క చూడగలిగితే ఎంతో విషాదం, అంతులేని అగాధం. నీక్కావల్సింది అదా? ఆ జీవితమే నీక్కావాలను కుంటున్నప్పుడు నిన్నా దేవుడు కూడా మార్చలేడు" కాస్త సీరియస్‌గా తన కోపాన్ని వెళ్ళగ్రక్కింది నీలిమ.

"నీలిమా, ముగ్ధా, సురభీ, వినండి... ఇవాళ స్పష్టంగా చెపుతున్నాను. నా లైఫ్ ఏంబిషన్ ఏంటో. నీలిమ నన్ను బాగా అబ్జర్వ్ చేసింది. నీలిమ చెప్పింది కరెక్ట్. నేను ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పుడే ఫస్ట్ టైమ్ రేఖ ఫోటోని చూసాను. రాన్రానూ రేఖ గురించి తెలుసుకున్నాను. రేఖ నా ఆరాధ్య దైవం. బతికితే రేఖలా బతకాలి. మార్లిన్ మన్రోలా ప్రపంచాన్ని గజగజలాడించాలి. పామెల్లా బోర్డస్‌లా సెన్సేషన్ క్రియేట్ చేయాలి. కామసూత్ర కండోమ్స్ అడ్వర్టేజ్‌మెంట్ ద్వారా యిప్పుడు సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న పూజాబేడీలాగే ఆమె తల్లి ప్రతిమాబేడీ కూడా ఒకప్పుడు ఎంత సెన్సేషన్ క్రియేట్ చరేసిందో తెల్సా... అలా వుండాలి.

సెన్సేషన్ లేనిదే ప్రపంచం లేదు. నిత్యం రంగురంగుల ప్రపంచంలో బతకాలంటే, నిత్యం ఆకర్షణల వలయాల్లో అద్భుతంగా తిరగాలంటే, లక్షల కళ్ళు నన్ను వాచ్ చేస్తుండాలి. పేపర్లు, పత్రికలు నా చుట్టూ, నేను క్రియేట్‌చేసే న్యూస్‌ని ప్రచారం చేసుకుంటూ తిరగాలి. నా కనుచూపు, నా కదలిక, నా మాట, నా అడుగు, నేనెక్కడుంటే అక్కడ, యువతరానికి ఓ థ్రిల్ ఉండాలి.

ఇది నా డ్రీమ్ కాదు. అతిత్వరలో నేను నిజం చేసుకోబోయే వాస్తవం. దానికోసం నేనేమైనా చేస్తాను. అందుకోసమే నా వేట. దేని కయినా ఒక వూత కావాలి. ఆ సపోర్టుకోసమే నేను వెయిట్ చేస్తున్నాను" చాలా ఆవేశంగా, ఉద్వేగంగా చెప్పింది అలక.

"అలా ఫైరయిపోకే తల్లీ! మనిషన్నాక ఏదో ఒక కేజీ అయినా అజ్ఞానం వుంటుంది కదా. ఆ అజ్ఞానంతోనే నీలిమ వాగింది! నీ ఐడియాలు, ఐడియాలజీలు మాకు తెలీకనా? కోటను చూడ్డానికొచ్చావా? కొట్లాడు కోడానికొచ్చావా? పదండి, పదండి" ఆ మాటతో ఆ టాపిక్ ఆగిపోయింది.

అమ్మాయిలు, ఆ వెనక అబ్బాయిలు కొంతమంది కోట వెనక నున్న కొండెక్కారు. మరికొంతమంది రాణీమహల్‌వేపు నడిచారు.

ముగ్ధ, సురభి, అలక, నీలిమ రాణీమహల్లోకి అడుగుపెట్టారు. ఆ వెనక 'బాడీగార్డుల్లా' కొంతమంది అబ్బాయిలు, ఏవేవో జోకులు, అల్లరి. నీలిమ హేండ్ బేగ్‌లోంచి కెమెరా తీసి ఫొటోలు తీస్తోంది. ఓ అరగంట తర్వాత అందరూ కిందకు దిగారు. రాణీమహల్‌వేపు నడిచి, అక్కడ ఓ పావుగంట గడిపి, పాడుబడ్డ అప్పటి ఉద్యానవనం దగ్గర కొచ్చారు.

అక్కడకు కొంచెం దూరంలో నీళ్ళులేని కొలనుంది. అక్కడున్న కాగు చెట్టుకింద కూర్చున్నారు.

"ఇంత పెద్ద కోటకు ప్రహరీగోడలేదు చూశావా?" తనో అద్భుతమైన విషయాన్ని కనుక్కున్నట్లుగా అంది సురభి.

"నిజమేనే, ఎందుకు లేదు?" ఆశ్చర్యం వ్యక్తం చేసింది నీలిమ.

మన హిస్టరీ మేడమ్‌ని అడగాలి. గోడెందుకు లేదో తెలుస్తుంది" అలక అంది.

"ఆవిణ్ని అడుగుతావా? ఇంతే సంగతులు. ఉన్న పిసరు హిస్టరీ జ్ఞానం అటకెక్కి పోతుంది. ఎవరయినా పరిశోధకుల్ని అడిగితే ఎందుకు లేదో తెలుస్తుంది" నీలిమ అంది.

"పాపం... హిస్టరీ మేడమ్ మంచావిడేనే" జాలిపడుతూ అంది సురభి.

"మంచావిడే. నేను కాదన్నానా? ఆవిడ చదువుకున్న హిస్టరీ ఎప్పుడో మర్చిపోయుంటుంది. ఇప్పుడు ఆవిడ పరిశోధనలన్నీ ఆవిడ భర్త శ్రీధర్ చుట్టూరా తిరుగుతున్నాయి తప్ప అవిడకు మరో ధ్యాసలేదు" చెప్పింది నీలిమ.

"ఏం?" అడిగింది ముగ్ధ ఆసక్తిగా.

"నీకు తెలీదా. చాలా ఇంటరెస్టింగ్ స్టోరీలే. నాకుమాత్రం హిస్టరీ మేడం కన్పించగానే, వాళ్లాయనే గుర్తుకొస్తాడనుకో పాపం. ఆయనేదో సైంటిష్టట. ఎప్పుడూ పరిశోధనలే ఆయనకు లేబరేటరీయే ఇల్లూ, బెడ్‌రూమూ. వాళ్లకి పిల్లలు లేక పోవడానికి కారణం ఏమిటో తెలీదుగానీ, ఆయన రీసెర్చ్ పేరుతో లేబరేటరీలో వుండిపోయి, అమ్మాయిలతో కాలక్షేపం చేస్తున్నాడని మన హిస్టరీ మేడంకి అనుమానం. మన సురభికి ఆయన బాగా పరిచయం, ఏమే ఆయన గురించి చెప్పవే పాపం" నీలిమ సురభివేపు చూసి అంది.

"నిజంగా ఆయన సబ్జెక్టులో జీనియస్సే. ఆయన ఎదురుగా కూర్చుంటే, ఒక ఐన్‌స్టిన్‌ముందు, ఒక ఫ్రాయిడ్‌ముందు కూర్చున్నట్టుంటుంది. మన డౌట్సుని ఎంత సులభంగా క్లియర్‌చేస్తారో తెల్సా. రేర్ అండ్ ఎన్‌ఛాంటింగ్ పర్సనాలిటి... ఐ లైక్ హిమ్..." సురభి చెప్పింది.

"ఐలైక్ హిమ్. ఆహా... అమ్మగారు ఆ పరధ్యానం కాండిడేట్‌ని లైక్ చేస్తున్నారన్నమాట. అయితే ఇందులో ఏదో గూడుపుఠాణి వుందన్నమాట" అలక వెక్కిరింతగా అంది.

"గూడుపుఠాణీ కాదే పిచ్చిమొద్దూ. లైకింగ్‌కీ, లవింగ్‌కీ తేడా తెలీదు. ఏం ప్రేమిస్తే తప్పా. చెప్పు. ఆయనకేం... ఎంత డిగ్నిఫైడ్‌గా వుంటాడు" సపోర్టుచేస్తూ అంది సురభి.

"పర్సనల్ పొగడ్తలదాకా వచ్చిందే వ్యవహారం. చూస్తుంటే... నువ్వు నిజంగా ప్రేమిస్తావా, ప్రేమిస్తున్నావా?" ముగ్ధ మనోహరంగా నవ్వుతూ అంది.

"అవునే ముగ్ధా ఏం ప్రేమిస్తే తప్పా, తప్పున్నరా. ఆయనకు పరిశోధనలే పిచ్చి. ఆ పిచ్చిలో భార్య, ఇల్లునీ కూడా నెలలకు నెలలు మర్చిపోయిన సందర్భాలున్నాయి. తెల్సా. ఆయనకు భార్యంటే ఎంత కోపమో తెల్సా ఆవిడ్ని చాలా విసుక్కుంటాడాయన. తనకు తగ్గమనిషి దొరకలేదని ఎంత బాధపడతాడో తెల్సా. మొదట్లో ఆయన భార్యని ఎంతలా ప్రేమించేవాడో తెల్సా. కానీ రానురాను అన్నీ తెలిసిన భార్యే తనంటే విసుగుదల ప్రదర్శించడంతో ఆవిడమీద ఇష్టాన్ని ఆయన తన పరిశోధనలమీదకు మరల్చాడు. ఇప్పుడు ఆవిడంటే ఆయనకు ద్వేషం. ఆ ద్వేషానికి పూర్తిగా ఆవిడే కారణం. ఎప్పటికయినా తన ప్రతిభను ప్రపంచం గొప్పగా గుర్తిస్తుందనీ, నోబుల్ బహుమతిని పొందే అద్భుతమయిన విషయాన్ని తను కనుక్కోగలనని ఆయనకు నమ్మకం. ఆ నమ్మకం వల్లే ఆయనలా లేబరేటరీలోనే వుంటాడు. ఆవిడనుకునే విధంగా అమ్మాయిలతో గడపడానికి కాదు. ఆయనలాంటి వ్యక్తికాదు"

"శ్రీధర్‌గారు నీకంత బాగా తెల్సని నాకు తేలీదే. సారీ" అంది ముగ్ధ సురభితో.

"ప్రేమించక ప్రేమించక మంచివాడ్ని ప్రేమించావే. అందరూ ఆ సైంటిస్ట్‌ని ఏ నిక్‌నేమ్‌తో పిలుస్తారో తెల్సా. మాడ్‌మాక్స్ అంటారు. ఆ మాడ్‌మాక్స్‌గారిని నువ్వు లవ్‌చేసి ఆ మాడ్‌మాక్స్ గ్రూప్‌లో చేరుతానంటే నాకేం అభ్యంతరంలేదు. కానీ జాగ్రత్త. నువ్వూ మరో హిస్టరీ మేడంలా తయారయ్యావనుకో అంతే మరి" అలక అంది.

"అలా మాట్లాడక. ఇవాళ మాడ్‌మాక్స్ అన్నవాళ్ళే రేపు ఆయన్ని ఆశ్చర్యపోవచ్చు. ఇవాళ ఆయన్ని చూసి పిచ్చి సైంటిస్ట్ అన్నవాళ్ళే రేపు ఆయన పక్కన నిలబడలేకపోవచ్చు. మన హిస్టరీ మేడమ్ గనక సరిగ్గా ఆయన్ని డీల్‌చేస్తే ఈ పాటికే ఆయన తననుకున్నదాన్ని సాధించేవాడని నా నమ్మకం. ఇవాళ ఆయన ఫ్రస్ట్రేషన్‌లో వున్నాడనుకుంటే దానిక్కారణం ఎవరు – ఆవిడే. తను సాధించాల్సిన లక్ష్యం ఆయనకు దూరమైపోవడానికి కారణం ఎవరు... ఆవిడే" సురభి చెపుతోంది. ఆ మాటలకు అడ్డుగా వచ్చింది నీలిమ.

"అన్నీ ఆవిడమీద తోసెయ్యడం అన్యాయమే. తప్పయినా, ఒప్పయినా భార్యకు, భర్తకూ ఇద్దరికీ సమానమైన బాధ్యత వుంటుంది."

"నువ్వు సరిగ్గా విన్పించుకోవడంలేదు. నేను చెపుతున్న పాయింట్ ఏంటి. ఆయనలా తయారుకావడానికి కారణం ఆవిడని అంటున్నానా. ప్రపంచంలో గొప్పగొప్ప వ్యక్తుల్ని తీసుకో. ఆ మగవాళ్ళని అలా మలచిన వ్యక్తులు స్త్రీలే. స్త్రీ తలచుకుంటే ఆ స్త్రీ ఆ పురుషుడికి అపరిచితురాలు కావచ్చు. ప్రేయసి కావచ్చు, తల్లికావచ్చు, అక్క కావచ్చు, వదిన కావచ్చు, భార్యకావచ్చు. ఎవరయినా స్త్రీ తలచుకుంటే పురుషుల్నీ నెంబర్‌వన్‌గా తయారుచెయ్యగలదు. ఈ ప్రపంచంలో గొప్పగొప్ప విజయాలు సాధించిన ప్రతి ఒక్కడివెనుక స్త్రీ వుంది. పరమ క్రూరుడని చెప్పుకునే జర్మన్ నియంత హిట్లర్ వెనుకున్నది గెలీ అనే స్త్రీ. పాకిస్తాన్ భుట్టో వెనక హస్నాషేక్, చార్లీచాప్లిన్ వెనుక ఊనా, అంతెందుకు అమితాబచ్చన్‌ని తీసుకో. అమితాబ్ నెంబర్‌వన్ స్థానానికి రావడానికి వెనకున్నది ఎవరో తెలుసా.... జయాబచ్చన్ కాదా. రాజ్‌కపూర్‌ని తీసుకో. నర్గీస్, లతామంగేష్కర్... ఇలా ఎన్నెన్నో ఎగ్జాంపుల్స్ వున్నాయి.

పురుషుడ్ని అభిమానించే నిజమైన స్త్రీ, పురుషుడ్ని ప్రేమించే నిజమైన స్త్రీ, పురుషుడ్ని వాంఛించే నిజమైన స్త్రీ, పురుషుడి ఆలంబనను కోరుకునే నిజమైన స్త్రీ ఆ పురుషుడు నుంచి కోరుకునేది ఏమిటో తెల్సా? విజయం.

వర్తమానాన్ని శాసించే విజయం. భవిష్యత్తుని తన గుప్పిట్లో బిగించుకో గలిగే విజయం. అందుకే స్త్రీని ఆదిశక్తి అన్నారు. ఆదిశక్తికి నిన్నటి పురాణాలు చెప్పే అర్థం దేవతా పరమైనదయితే, నేటి ఆధునిక శాస్త్రం చెప్పే అర్థం మూలశక్తి అని.

మొన్నటి వరకూ బ్రిటన్‌ను పాలించిన మార్గరెట్ థాచర్‌ను చూడు. కొరజానో ఆక్వినోను చూడు, ఇమెల్డా మార్కోస్, ఇందిరాగాంధి, మదర్ తెరిస్సా, సిరిమావో బండారునాయకే, మేనకా గాంధి, కిరణ్‌బేడీ, నందినీ శతపధి, పి.టి. ఉష, జయలలిత, ఎంతోమంది... ఎంతోమంది ఆయా రంగాల్లో ఉక్కు వనితల్లా నిలిచారు. వాళ్ళు ఒక్కొక్కరూ ఒక్కొక్క మూలశక్తికి నిదర్శనం.

ఒక పాపర్‌ని కింగ్‌ని చేయగలదు స్త్రీ. ఒక బెగ్గర్‌ని దేశానికి ప్రెసిడెంటుగా చేయగలదు స్త్రీ. ఒక అనామకుడ్ని ఎవరెస్టు శిఖరం మీదకు ఎక్కించగలదు స్త్రీ. ఒక సాధారణమైనవాడ్ని సాహసిని చేసి చంద్రమండలం మీదకు పంపించ గలదు స్త్రీ.

చెప్పేదేమిటంటే నేనేగనక మన హిస్టరీమేడం స్థానంలో వుంటే ఈ పాటికి సాదా సైంటిస్టుగా మనమధ్యనున్న శ్రీధర్ గ్రేట్ సైంటిస్టుగా తయారయి వుండే వాడు, గుర్తింపు పొందేవాడు. తలచుకుంటే ఏ స్త్రీ అయినా నయాగరా

జలపాతంలాంటి ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని పురుషుడికి యివ్వగలదు.... తెలుసా...” చెప్పింది సురభి ఎంతో ఉద్రేకంతో.

“నో మేడం. ఇటీజ్ నాట్ పాజిబుల్” వాళ్ళ సంభాషణను అంత వరకూ చాలా జాగ్రత్తగా వింటున్న ఓ యూనిర్సిటీ కుర్రాడు సడన్‌గా ఆమాటన్నాడు. అతని పేరు పర్ణేష్.

ఒక్కసారి సురభితోపాటు మిగతా అమ్మాయిలు ముగ్గురూ సీరియస్‌గా అతనివేపు చూసారు.

సురభి ఉద్రేకంగా, ఉద్వేగంగా చెప్పిన మాటలే ఆ ముగ్గురమ్మాయిల్లో పనిచేస్తున్నాయి.

“నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ ఇన్ దిస్ వరల్డ్ యూ నో” పర్ణేష్ వేపు చూస్తూ సీరియస్‌గా అంది ముగ్ధ.

ముగ్ధవేపు చిరునవ్వుతో చూసింది సురభి తనని సమర్ధిస్తున్నందుకు.

“ఎస్. అఫ్‌కోర్స్. నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ ఇన్‌దిస్ వరల్డ్. బట్ వన్‌థింగ్. ఈ జనరేషన్‌లో అలాంటి లేడీస్‌లేరు. ఇవాళ్టి స్త్రీలు వంటింటికి, ఇంట్లో టి.వి.కి., బయట సినిమాలకి, బంగారు నగలకి, పట్టుచీరలకు, షాపింగ్‌కి పరిమితం తప్ప తమ మగాళ్ళని గొప్పగా మలచుకోవాలన్న ధ్యాస వున్నవాళ్ళు ఎక్కడా కన్పించడంలేదు. ఆ జనరేషన్ అయిపోయింది. మళ్ళీరాదు.

ఎంతసేపు ప్రక్క స్త్రీ ఏం కొన్నది? మనం అంతకంటే ఖరీదైంది ఎప్పుడు కొనాలి అని తప్ప – ప్రొడక్టివ్ కానేకాదు– ఇంటి ముందు ఖాళీఉన్నా, నాలుగు మొక్కల్ని పెంచుకోరు – మంచి అభిరుచులుండవు– చీర మడతలు నలగకుండా పనిమనుష్యుల సహాయంతో వండటం– వార్చటం, తినటం, తినబెట్టటం – అంతేగా? జపాన్‌లో, కొరియాలో ప్రతి ఇల్లు ఒక ఏన్సిలరీ యూనిట్ అట – నడిపేది ఎవరో తెలుసా? గృహిణులు... కాని మనదేశంలో? తెలుసుగా? మొగుడ్ని వెనక్కిలాగే వాళ్ళేగాని ముందుకు నడిపేవారు లేరు” కాజువల్‌గా అన్నాడు పర్ణేష్.

“నో మిస్టర్ పర్ణేష్. మీరు స్త్రీలని కించపరుస్తున్నారు – ఏ యుగంలోనైనా, ఏ జనరేషన్‌లోనైనా, అలాంటి స్త్రీలు వుంటారు. మనదేశంలో కూడా....

ఈ ఆపరేషన్ గురించి ఆలోచించండి. మనదేశంలో ఆయా రంగాల్లో ఎంతోమంది జీనియస్‌లు, ప్రతిభావంతులు, మేధావులున్నారా? లేదా? చెప్పండి” సూటిగా అడిగింది నీలిమ, పర్ణేష్‌ని.

"ఉన్నారు" నెమ్మదిగా అన్నాడు పర్ణేష్.

"అంటే, ఆయా వ్యక్తుల వెనక అంతమంది స్త్రీ లున్నారనేగా అర్థం." నీలిమ ఆర్గ్యుమెంట్‌కి చప్పట్లు కొట్టింది అలక.

"గుడ్, ఆర్గ్యుమెంట్" గట్టిగా, బైటకనేసింది ముగ్ధ. పర్ణేష్ మరేం మాట్లాడలేకపోయాడు.

"మా నలుగుర్నే తీసుకోండి. ట్వంటీఫస్ట్ సెంచరీలోకి వూహించని మార్పులతో, ఎలక్ట్రానిక్ ప్రభంజనంతో దేశం ప్రవేశిస్తున్న సమయం ఇది. ఈ జనరేషన్‌కే చెందిన వాళ్ళంమేం. మేం నాన్ ప్రొడక్టివ్ అని అనగలరా? ఇకపై చూసిగదా అనాలి?

మేం ప్రేమలకు, అభిమానాలకు, అనుబంధాలకు ఆత్మీయతలకు దూరం కాలేదు. కాబోము.

ఇది మేం మనుష్యులమని అనిపించుకొనేందుకు – ఇక మేం దేశానికి ఉపయోగపడగలమా? లేదా? అనేది ప్రశ్న.... అందుకూ సమాధానం చెప్పగలం.

ఒక్క హార్డ్‌కొర్ క్రిమినల్‌ని బుద్ధుడిగా మార్చగలం. అశోకుడు చేత మళ్ళీ యుద్ధం చేయించగలం. శివరాసన్‌ని ఒక పీఠాధిపతిగా మార్చగలం. దారీ తెన్నూ లేకుండా, ఒక ప్రొపర్ గైడెన్స్ లేకుండా తిరిగే, ఒకడిచేత జీవితంలో వండర్స్ చేయించగలం. వుయ్ ఆర్ డామ్ ష్యూర్ ఎబౌట్ ఇట్. అండ్ వుయ్ ఆర్ డామ్ సీరియస్ ఎబౌట్ ఇట్." సురభి ఛాలెంజ్‌గా అంది పర్ణేష్‌వేపు చూస్తూ.

"అన్నంత సులభంకాదు, చెయ్యడం." ఒకింత సవాల్ ధ్వనించింది పర్ణేష్ మాటల్లో.

దాన్ని భరించలేకపోయారు అమ్మాయిలు.

అవమానభారంతో వాళ్ళ అందమైన మోములు కందిపోయాయి.

"కొందరి విషయంలో మీ ఆర్గ్యుమెంట్ కరక్ట్ అంతే. అందరి విషయంలో మాత్రంకాదు. అలాంటి షో పీస్‌లాంటి స్త్రీలమూలంగా నిజంగా ఎంతో సాధిస్తున్న స్త్రీలుకూడా ఇలాంటి అవమానాన్ని ఎదుర్కోవలసి వస్తోంది." అంది ముగ్ధ పౌరుషంగా.

పర్ణేష్‌కి ముగ్ధ ఆర్యుమెంట్‌లో రీజనింగ్ కనిపించింది. అందుకే మౌనంగా ఉండిపోయాడు.

"ఒ.కే. మిస్టర్ పర్ణేష్.... బెట్....

ఈ క్షణంలో మేం నలుగురం ఓ సంచలనాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుంటున్నాం. నలుగురు భిన్న మనస్తత్వాల అపరిచిత వ్యక్తుల్ని మేం ప్రేమిస్తాం.

వాళ్ళను గొప్ప వ్యక్తులుగా తయారుచేస్తాం" అంటూ అందరివేపూ చూసింది ముగ్ధ.

ఒక్కక్షణం లోతైన నిశ్శబ్ధం అలుముకుందక్కడ.

ఏదో సరదాగా మొదలైన సంభాషణ గంభీరతను సంతరించుకోబో తోంది.

చిన్న తర్కంతో – స్త్రీ పరమైన అస్థిత్వపు ప్రశ్నతో మొదలయిన అతి తేలికైన సంభాషణ అలా మలుపు తిరుగుతుందని, ఒక పెద్ద సంచలనానికి హేతువవుతుందని ఎవరూ ఊహించలేదు.

అలక, సురభి, నీలిమ విచిత్రమైన ఉద్వేగానికి గురయ్యారు. అది నిజమా? నిజంగా నిజమా? ముగ్ధ చాలా విషయాల్ని ఎంతో స్పోర్టివ్‌గా తీసుకొనే ముగ్ధ, స్త్రీ పరమైన అస్తిత్వపు ప్రశ్న ఎదురయితే గంభీరంగా మారిపోతుంది– చాలా సీరియస్‌గా తీసుకొంటుంది. గతంలో తమ నలుగురి మధ్య అలాంటి అనుభవాలు అప్పుడప్పుడు చోటు చేసుకున్నాయి.

పర్లేష్ అనవసరంగా రెచ్చగొట్టాడా?

జస్ట్ కేజువల్‌గానే అన్నాడా?

ఏమో. ఏది ఏమైనా ముగ్ధ విధించబోయే నిబంధనలకు తాము ఒప్పుకు తీరాలి. అదీ తమ మధ్యనున్న స్నేహం, అనుబంధం.

అక్కడ పేరుకున్న నిశ్శబ్దాన్ని బ్రద్దలుచేస్తూ ముగ్ధ తీవ్రస్థాయిలో ప్రశ్నించింది–

"ఏం నిర్ణయించుకున్నారు?"

మిగతా ముగ్గురు ఒకింత ఉలికిపాటుకి గురయి, వెంటనే తేరుకొని అంగీకార సూచకంగా తలలూపారు.

"ఓ.కే. గుడ్. ఇది బెట్ అనుకున్నా, ఛాలెంజ్ అనుకున్నా ఒక సంవత్సరం పాటు దీనికి కట్టుబడి వుండాలి. వుండగలరా." ముగ్ధ ముగ్గురు ముఖాలవేపు సీరియస్‌గా చూస్తూ అడిగింది.

"నీలోనే కాదు. మాలోనూ కరెజ్ వుంది." అయిడియా చాలా అద్భుతంగా వుంది సురభికి– అందుకే ధైర్యంగా అంది.

"జీవితంలో గొప్ప సంఘటనలన్నీ, ఒక్క నిమిషంలో తీసుకున్న నిర్ణయాలవల్లే జరుగుతాయి. నో సైడ్ ట్రాక్స్. సవాల్ చెయ్యడంకాదు, ప్రాక్టికల్ లైఫ్‌లో నిలబడగలగాలి. మరోసారి అడుగుతున్నాను. మరోసారి ఆలోచించండి.

ఇది ఎవరి కోసమో తీసుకుంటున్న నిర్ణయం కాదు. ఈ జనరేషనేకాదు, ఏ జనరేషన్‌లో లేడీస్ అయినా 'షో పీసెస్' కాదని చెప్పడానికి మనమీ నిర్ణయం తీసుకుంటున్నామని గుర్తించుకోండి. ఇదొక ప్రయోగం. ఈ ప్రయోగంలో దేనికి భయపడగూడదు... మీకు ఆ ధైర్యముందా? చెప్పండి" ముగ్ధ ఉద్రేకంగా అంది.

"మాకూ గట్స్ వున్నాయి" అలక అంది స్థిరంగా.

"అయితే నాదో చిన్న డౌట్. వాటెబౌట్ అవర్ ఫరదర్ ఎడ్యుకేషన్" నీలిమ అడిగింది.

"ఒన్ ఇయర్ గడువు. ఆ గడువు తర్వాత మళ్ళీ కంటిన్యూ చెయొచ్చు ఇష్టముంటే" ముగ్ధ అంది.

"మరి..." ఏదో ప్రశ్న వేయబోయింది మళ్ళీ నీలిమ.

"నోమోర్ క్వశ్చన్స్. ప్లానింగ్ నాది, ఆపరేషన్ అందర్దీ.... నేన్చెప్తాను వినండి." ముగ్ధ మాటల్ని, ఆ ముగ్గురమ్మాయిలే కాదు, అక్కడున్న అబ్బాయిలు, అమ్మాయిలందరూ విచిత్రంగా వింటున్నారు. పర్ణేష్ కయితే మతేపోయింది.

"మన ఆపరేషన్‌లో భాగంగా మన నలుగురం నలుగురు మగాళ్ళను ఎంచుకుంటాం. ఆ నలుగురూ, నాలుగు భిన్నమైన మనస్థత్వాలకు చెందినవారై వుండాలి."

"మరి వాళ్ళని ఎలా ఎంచుకోవాలి. రోడ్డుమీద చూసి పికప్ చేసుకోవాలా." గబుక్కుని ఉత్సాహాన్ని ఆపుకోలేక అడిగింది అలక. అలా బాయ్‌ఫ్రెండ్‌ని పికప్ చేసుకోవాలని ఎన్నాళ్ళనుంచో అలకకు కోరిక.

"ఎందుకంత తొందర... ముందు జాగ్రత్తగా వినండి. మనుషుల మనస్తత్వాలు రకరకాలు. ఏ మనసులో ఏ ఇష్టంవుందో తెలీదు. సురభిని చూడండి. ఇన్నాళ్ళుగా మనమధ్యే తిరుగుతున్నా, దాని మనసులో అంతర్లీనంగా వున్న ఇష్టఇష్టాలు మనకు తెలీవు. పెళ్ళయిన శ్రీధర్‌వేపు తన ఆకర్షణను పెంచుకొంటోందని మనకు తెల్సా. తెలీదు. సురభిని అటువేపు డ్రైవ్ చేసిందేమిటి? ప్రేమా, కోరికా, ఆకర్షణా, కాదు. ఏదో సాధించాలనే శ్రీధర్ స్వభావం. అందువల్ల వాళ్ళిద్దరి మధ్యా వయోభేదం వున్నా, అది కాదు మనకు ముఖ్యం, మనస్సు. కానీ, ఎవరి అభిరుచికి తగ్గట్టు, వాళ్లని ఎంచుకుని, ప్రేమించడంలో థ్రిల్ లేదని నా అభిప్రాయం. ఉదాహరణకు నన్నే తీసుకోండి. నాకు రఫ్ కేరక్టర్స్ ఇష్టం. కానీ నేను సాత్వికంగా ఉంటాను. రేపు నేను ప్రేమించే వ్యక్తి సాఫ్ట్‌గావుంటే నేను భరించలేను. అమాయకంగా ఉంటే భరించలేను. అలాగే నీలిమ, అలాగే అలక ఎవరి మనస్తత్వాలు వారివి.

అందువల్ల మనం భిన్న మనస్తత్వాల వివరాలతో నాలుగుచీటీలు తయారుచేద్దాం. ఆ నాలుగింటిని నలుగురు తీసుకుందాం. ఎవరికి ఎలాంటి కేరక్టర్ వస్తే ఆ వ్యక్తిని మన ప్రపంచానికి అనువుగా మలచగలగాలి. ఆ వ్యక్తి ఒక గొప్ప ప్రయోజనాన్ని సాధించాలి. సాధించేటట్టు మనం చెయ్యాలి. చీటీలో మనకు నచ్చిన వ్యక్తిని ఎంపిక చేసుకోవటంతో మన ఆపరేషన్ ప్రారంభమవుతుంది. వాళ్ళని మనం ఎంపికచేసుకోగానే ఒక నెలరోజులు లోపల వాళ్ళ వ్యక్తిత్వం గురించి, మంచిచెడ్డల గురించి, ఆస్తిపాస్తులగురించి చదువుసంధ్యల గురించి, అలవాట్లూ అభిరుచుల గురించి దర్యాప్తు చేస్తాం. మనం వాళ్ళని ఏ వేపుగా మలచుకోగలం అన్నది ఇక్కడ పాయింట్. అలా మలచడమే కాకుండా మనం తయారుచేసే ఆ వ్యక్తి ఈ దేశంలో ఒక అద్భుత విజయాన్ని సాధించాలి. అట్లా అతన్ని మలచడమే మన బెట్, మన చాలెంజ్.

వాళ్ళ నలుగుర్నీ అబ్జర్వ్‌చేశాక మనం నాలుగురిపోర్టులు తయారు చేసుకుంటాం. మనం ఫైనల్‌గా ప్రోగ్రామ్‌ని చకౌట్ చేసుకుంటాం. మన బెట్ గురించి వాళ్ళకు చెప్పాల్సిన అవసరంలేదు. అదేకాకుండా మన బెట్ మన లవ్, మన మారేజ్ ఈ విషయాలన్నీ కాన్ఫిడెన్షియల్‌గా వుంచాలి.

గడువు ఒన్ ఇయర్. ఈ ఏడాది మనకు మన ఇళ్ళతో సంబంధా లుండవు మనం ఎక్కడున్నామో, ఏం చేస్తున్నామో వాళ్ళకు గానీ, మిగతా ప్రపంచానికిగానీ తెలియాల్సిన అవసరంలేదు. సి.బి.ఐ. డిపార్టుమెంట్లో మనకు ఉద్యోగాలొచ్చాయని, అందులో ఉద్యోగాలు చేస్తున్న విషయం రహస్యంగా ఉంచాలని, ఒక సంవత్సరం తర్వాత కలుస్తామని మన ఇళ్ళకు ఉత్తరాలు రాసేస్తే సరిపోతుంది" చెప్పడం ఆపింది ముగ్ధ.

"ఇక్కడ్నించి ఇలా ఎటో వెళ్ళిపోయినా, మా ఇంట్లో ఎవ్వరూ ఏమనరు." అలక ఆనందంగా అంది.

"నీ గురించి కాదు. వాళ్ళిద్దరుకూడా వున్నారు కదా!" ముగ్ధ అంది సీరియస్‌గా.

"డోన్ట్‌వర్రీ. వుయ్ కెన్ మానేజ్" హామీ ఇచ్చింది నీలిమ.

"మరి, మనగురించి ఓ.కే. మనం ఎంచుకున్న వ్యక్తులకు మనం నచ్చకపోతే." సందేహం వ్యక్తంచేసింది సురభి. ఆ మాటకు నవ్వింది ముగ్ధ. తెరలు–తెరలుగా నవ్వింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mugdha**

* * *

# Read other books by Suryadevara Rammohana Rao @

http://kinige.com/kbrowse.php?via=author&name=Suryadevara+Rammohana+Rao